
**కథానిక**

# ఓ ప్రియురాలి కథ



• పురాణం సుబ్రహ్మణ్య శర్మ • చిత్రాలు : ఈరన్న

సగం నగం నిర్మించిన కట్టడాన్ని కూలీలు నీళ్ళోసి తడుపుతున్నారు. కూలీల పిల్లలు ఆ సిమెంటు కట్టడంలో ఆడుకుంటున్నారు - కాళ్ళకడ్డం వస్తూ, జరిగే పనులకు ఆటంకంగా. నిర్మాణపు పనులకూ, పిల్లల కేళీవిలాసానికీ పొంతన లేదు. అయినా, చౌదరిగారు అదంతా చూస్తూ చెవి దగ్గర జేబు రేడియో పెట్టుకుని బి.బి.సి వార్తల్ని వింటూ, జరిగే తతంగాన్ని పరామర్శిస్తున్నారు.

తెల్ల లాల్చీ సిల్కుది ముడుతలు పడ్డది తొడుక్కుని, చెంగావి రంగు బెంగాలీ అడ్డపంచె కట్టుకుని పేము కుర్చీలో కూర్చున్నారు. ఆ కుర్చీ ఇసుక కుప్ప పక్కన, నిర్మాణంలో ఉన్న మూడంతస్తుల భవనానికి ఎదురుగా, వేప చెట్టు నీడలో ఎవరో కూలవేసినట్లు కూరుకు పోయి ఉంది. సైకిల్మీద ఎవరో పేపరు కుర్రాడొచ్చి ఒక సాయంకాలం దినపత్రికను చేతికందిచ్చి వెళ్ళాడు.

అల్లంత దూరాన వీధిమీదకు కట్టిన పాలరాతి గచ్చు అరుగు పక్కన పాత హెరాల్డు కారు చెట్టు కింద పార్కు చేసి ఉంది. చౌదరిగారు ఆ పాత కార్లో మార్నింగ్ వాక్‌కి వెళ్తారు.

జూబిలీ హిల్స్‌లో కొండలు, గుట్టలు, రాళ్ళపక్క నుంచి బండి తోలడం వింతగానే కాక వినోదంగా కూడా ఉంటుంది. అక్కడి కట్టడాలన్నీ-ఏ ఇల్లూ ఒక లెవల్లో ఉండదు. దారులన్నీ - ఎత్తు పల్లాలతో అస్తవ్యస్తంగా, కంగాళీగా ఉంటాయి. ఎవరో కట్టిన ఇళ్ళలో ఇంకెవరో ఉంటారు అక్కడ. ఒక చిత్రమైన నిశ్శబ్దం అక్కడ సహజంగా ఉంది.

దూరంగా ఎత్తుమీద ఉన్న అపోలో వెంకటేశ్వరుడి గుడి నుంచి గంటలు వినిపిస్తున్నాయి. అపోలో వారి ఉద్యానవనాల్ని చుట్టి ఉన్న రాతిగోడ పక్క నుంచి కార్లు, జీపులు, ఆటోలు ఉండి ఉండి చప్పుళ్ళు చేస్తాయి - అటూ ఇటూ పరిగెత్తుతూ. ఇంతలో చౌదరి గారిని చూసి పలకరించడానికి శర్మగారొచ్చారు.

శర్మగారిని చూస్తూనే డైనింగ్ టేబిల్‌వద్ద వేసే పొడవాటి కుర్చీని చౌదరిగారు తెప్పించి వేసి, 'కాఫీయా, టీయా' అని అతిథిని అడిగి, కాఫీకి చెప్పి, "ఈవాళ మీకో కథ చెప్తాను. మీరు రాయాలి. రాయగలరు" అని మూతికి చేయి అడ్డం పెట్టుకుని నవ్వారు. కళ్ళు మెరుస్తూండగా అయన చెప్పుకు పోయారు, విలాసంగా. కాఫీ వచ్చింది. ఇద్దరూ తాగి కప్పుల్ని ఇసుకలో జారవిడిచారు. సూతుడు శౌనకాది మహామునులకు చెప్పినట్లు చౌదరిగారు శర్మగారికి కథ చెబుతున్నారు.

"మా ఊళ్ళో సుబ్బులు అని ఓ నర్సుపిల్ల ఉండేది. పిల్ల అంటే పిల్ల కాదు. మాంఛి వయసులో జవనాశ్వంలా ఉండేది. చూసేవాళ్ళకు చెరకు ముక్కలా, చక్కెర కడ్డీలా, బెల్లపు అరిసెలా కొరుక్కుతిందామా అనేట్లు ఉండేది.

నర్సు వృత్తిలో మాత్రం ఆమె సిన్సియర్. డాక్టర్ల వైద్యం కంటే ఆమె నర్సింగ్‌వల్లే చాలామంది బతికి బట్టకట్టారని విన్నాం. అందుకని, ఆవిడది అమృత హస్తం అనేవారు.

ఆవిడ కళ్ళు చక్రాల్లా ఏ కంతుడో, జయంతుడో, వసంతుడో అన్నవాడి కోసం ఎదురు చూస్తున్నట్లు ఉండేవి. రాత్రిళ్ళు ఆమె ఫ్లారెన్స్ నైటింగేల్‌లాగా ఉండేది. రోగులకు కళ్ళలో వత్తులేసుకు సేవ చేసేది.

అయితే, ఆమెకో ప్రియుడున్నాడు. వాడు ఓ కుర్ర డాక్టరు. మావాడే. వాడు గుండె జబ్బుల మీద స్పెషలైజ్ చేయడానికి లండన్ వెళ్ళాడు. వాడు అలా వెళ్ళాడో లేదో ఈవిడకు బెంగ పట్టుకుంది. బూరెల్లా ఉండే బుగ్గలు తీసిపోయాయి. బంతుల్లా ఉల్లాసంగా అటూ ఇటూ ఆడుతూ ఉన్నట్లుండే ఎదురు రొమ్ములు జాలిగా వాలిపోయాయి. ప్రబంధ సౌందర్యం అంతా మాయమై, పిల్ల చిక్కి శల్యమైపోయింది. కళ్ళలో మెరుపు మాత్రం తగ్గ లేదు. కుర్ర డాక్టరుమీద ఈవిడ ప్రేమ ముదిరి 'అంతా ప్రేమమయం, జగమంతా ప్రేమమయం' అన్నట్లయింది. ప్రేమ వాత పడినవారు మారిపోతారు. రాగితీగ మీద కరెంటు పాకినట్లు ఆడపిల్లకు ప్రేమ షాకు తగిలితే జగన్మోహనంగా మారిపోతుంది.


పెద్ద ట్రాజడీ మన జీవితాల్లో ఏమిటంటే ఈ ప్రేమగాలి కొంచెం కూడా సోకకుండానే మన జీవితాలు గడిచిపోతుంటాయి. ఈ లోపున పెళ్ళిళ్ళు, కట్నాలు, లాంఛనాలు, పిల్లల్ని కనడం, పెంచడం, ఆస్తులు పోగేసుకోడం, అమెరికా ప్రయాణాలు, ఊరగాయలు, మేడలు, మిద్దెలు కట్టుకోవడం అన్నీ జరిగిపోతాయి. వల్లకాట్లోకి చేరేదాకా మనల్నెవరూ ప్రేమించరు. దేన్నీ మనం ప్రేమించలేం. నిజమైన ప్రేమ ఆధ్యాత్మికం కూడా. జీసస్ ప్రేమ అలాటిది. బుద్ధుని కరుణ అలాటిది.

ఇంతకీ సుబ్బులు సుజాతగా పేరు మార్చుకుంది ప్రియుడి కోసం. కుర్ర డాక్టరు పేరు మురారి. మురారికి ప్రేమ జీవితంలో ఒక వంతు. కానీ, సుజాతకి తనువెల్లా నిలువు నిలువునా ప్రేమే. చెట్టున కాయ కాసి పండైనంత - కొమ్మను పూవు పూసి నవ్వినంత. శ్రీనివాసుని గుండెల మీద లక్ష్మీదేవి కూర్చుని ఆడుకున్నట్లు ఆడది ఆడుకోవాలి ప్రేమతో. ఇక నిలువలేక ఓ సుముహూర్తాన మద్రాసులో కుక్ అండ్ కంపెనీ వారి ఓడ ఎక్కి సుజాత లండన్ బయల్దేరింది.

ఆ రోజుల్లో ఇప్పట్లా విమానయానాలు లేవు. సూయజ్ కాలువ దాటి వెళ్ళాల్సిందే. శ్రీకృష్ణుణ్ణి గోపికలు, రాధ ఎలా ప్రేమించారో అలా సుజాత ఉరఫ్ సుబ్బులు కుర్ర డాక్టరు మురారిని ప్రేమించింది. మురారి ధన్యుడు. ఎందుకంటే, సుజాత అనే దేవకన్య తన కోసం 'విపినములు దాటి, వెన్నెల బయలు దాటి' అని కిన్నెరసానిలా తనచుట్టూ ప్రేమ ప్రవహింపజేస్తూ సముద్రాలు దాటి వస్తోంది.

ఆ ఓడలో సులేమాన్ అనే తోళ్ళ వర్తకుడు ఫస్ట్ క్లాసులో తన నౌకర్లు, గుమాస్తాతో ప్రయాణం చేస్తున్నాడు. అతను పాతగిలిన నౌకలు కొంటాడు, అమ్ముతాడు. చర్మాలు విదేశాలకు ఎగుమతి చేసి చాలా సంపాదించాడు.

అతనికి నౌకా నిర్మాణంలోని వ్యాపార మెలకువలు అన్నీ తెలుసు. పెళ్ళాం ఎప్పుడో టపా కట్టేసింది. మసీదులకి, దర్గాలకి, ఫకీర్లకి దానాలు చేస్తూ ఉంటాడు. మహా శ్రీమంతుడు. కానీ, పైకి అలా కనిపించడు. లండన్లో ముఖ్యమైన వ్యాపారపు లావాదేవీలు ఉండటంవలన బయల్దేరాడు. కానీ, అతని ఆరోగ్యం అంతంతమాత్రంగా ఉంది. అతనికి విపరీతమైన ఊపిరి సలపని ఉబ్బసం, ఇంకా ఏవో చిల్లర మల్లర కాంప్లికేషన్లు ఉన్నాయి. షిప్‌లో డాక్టరు వచ్చి చిల్లర మల్లర వైద్యం చేస్తున్నాడు. సులేమాన్‌కి మంచి నర్సు ఉండాలి, నర్సు సేవలు చేస్తేగాని ఈ కాంప్లికేషన్సులోంచి బయటపడడు అని ఓడ డాక్టరు చెప్పాడు. షిప్ డాక్టరు అంటే ఓడలో వచ్చే సీ సిక్‌నెస్, డోకులు, విరేచనాలు కట్టడానికి, చిన్న చిన్న జ్వరాలకు మందులివ్వడం,



**ఆవిడది అమృతహస్తం. ఆమె ఫ్లారెన్స్ నైటింగేల్‌లా రోగులకు కళ్ళలో వత్తులేసుకు సేవ చేసేది.**

గాయాలకు, పుళ్ళకు కట్టు కట్టడం వచ్చుగాని, అంతకుమించి పెద్ద పెద్ద రోగాలకు ఎంతమాత్రం పనికిరాదు.

సముద్రంలో ఓడ ఓ రాత్రిపూట పౌర్ణమి నాడు జోరుగా పరుగెత్తుతోంది. కెరటాలు చంద్రుణ్ణి చూసి ఎగసి పడుతున్నాయి. పౌర్ణమికి సంద్రానికి ఆటుపోటులు ఉధృతంగా ఉంటాయి. అలాటప్పుడు పాపం సులేమాన్‌కి కూడా జబ్బు ఎక్కువై తిరగ బెడుతుంది. సులేమాన్‌గారు మృత్యుముఖంలోనికి వెళ్ళిపోయినంతగా బాధ పడుతున్నారు. ఒక్కొక్కప్పుడు ఊపిరి అందడం లేదు. షిప్ డాక్టరు వచ్చి అన్నాడు గదా వైద్యుడు చేయగలిగింది ఇక లేదని - షిప్‌లో ఎవరైనా నర్సు ఉంటే - మంచి నర్సింగ్‌వల్ల బాగు పడాలి కానీ, మరో మార్గం లేదు. ఎవరేనా ఉన్నారేమో ట్రై చెయ్యండి అని చెప్పి వెళ్ళిపోయాడు.

సులేమాన్‌కి అష్టైశ్వర్యాలు ఉన్నాయి. మందీ మార్బలం చాలా ఉంది మద్రాసులో, బొంబాయిలో, కాన్పూరు, లక్నో నగరాల్లో. కానీ, ఇప్పుడు సముద్ర మధ్యంలో షిప్‌లో ఉన్నాడు. నిస్సహాయుడు. అల్లాని ప్రార్థించాడు. లోపల బీబీ నాంచారమ్మకు, వెంకటేశ్వరునికి కూడా ముడుపు కట్టించాడు. మృత్యు ముఖంలో ఉన్నవాడికి ఏ దేవత రక్షిస్తుందో, ఏ మంత్రంలో ఏ మహత్యం ఉందో, ఏ వైద్యుని మందు కాపాడు తుందోననే చింత ఉంటుంది.

సుజాత అనే చక్కని నర్సు ఒకతె మురారి అనే డాక్టరును కలుసుకోవడానికి లండన్ వెళ్తూ ఆ ఓడలోనే ఉందని సులేమాన్‌కి ఎవరు చెబుతారు? ఒక రాత్రి సులేమాన్‌కి బాగా ముదిరి శ్వాస అందక ఇక చివరి క్షణాలొచ్చేశాయని నౌకర్లు, గుమాస్తా కంగారు పడుతూ 'నర్సు' కోసం షిప్ అంతా గాలిస్తూ ఉండగా డైనింగ్ హాల్ దగ్గర సుజాత కనిపించింది. సుజాత అప్పుడు మీరాబాయిలా ఉంది. 'మీరాకే ప్రభు గిరిధర్' అన్నట్లుగా ఉంది. ఆ అమ్మాయి చుట్టూ ఏదో ప్రేమ కాంతి చిమ్ముతున్నట్లుగా ఉంది.

ఆ షిప్‌లో డైనింగ్ హాల్ దగ్గర ఒక స్వామీజీ లాంటి భక్తపుంగవుడు మీరాబాయి కథ చెబు తున్నాడు - 'మీరాబాయిని ఒక దుర్మార్గుడైన పురుషుడు నాతో వస్తావా అని కోరరాని కోరికను కోరాడు. ఆమె సరేనంది. మహా భక్తురాలు కదా ఆవిడకు దేహస్మృతి లేదు. అయితే, నా గదిలోకి పోదాం పద అని ఆమె చేయి పుచ్చుకు లాగాడు. భగవంతుడైన గిరిధారి సర్వం చూస్తూ ఉన్నాడు. కనిపెడు తున్నాడు. దేవుని దృష్టి ప్రస రించని చోటు భూతలమంతా వెదికినా దొరకదు. కనుక ఇక్కడే అందరి సమక్షంలో నీ కోర్కె తీర్చుకోమని ఆ మహా భక్తురాలు చెప్పింది. ఆ మూర్ఖుడు అవమానం పొందాడు. ఆమె కాళ్ళ మీద పడ్డాడు. అది వేరే సంగతి' అనగానే సుజాత కంట నీరు పెట్టుకుంది.

స్వామీజీ దగ్గరకు సులేమాన్ నౌకర్లు వచ్చి తమ స్వామి ప్రాణావసాన సమయంలో ఉండి మృత్యువుతో పెనగులాడుతున్నాడని చెప్పగానే, స్వామీజీ, 'ఇదిగో ఈ సుజాత నర్సే - పద పద' అని ఆమెను రెక్క పుచ్చుకుని ఫస్ట్ క్లాసులోని ప్రత్యేక గదిలో కొట్టు మిట్టాడుతున్న సులేమాన్‌వద్దకు తీసికెళ్ళారు.

సులేమాన్‌ను చూడగానే మహా ప్రమాదంలో



ఉన్నాడని గ్రహించిన సుజాత చీర విప్పి గాను తొడిగింది. గాను తొడగ్గానే ఆమెకు సేవా ధర్మం, ప్రేమ అన్నీ స్ఫూరణకు వచ్చాయి. తల్లి బిడ్డను చేతిలోకి తీసుకుని అక్కున చేర్చుకున్నట్లు, వయసులో ఎంతో చిన్నదైన తను సులేమాన్ బాధ్యత పూర్తిగా స్వీకరించింది. షిప్ డాక్టర్ని పిలిపించి అతనితో సంప్రతించింది. మందులు రోగాన్ని నయం చేయలేవు. ప్రేమతో సేవ చేయడంవలన బాధ నుంచి రోగి ఉపశమనం పొందుతాడు.

> మురారి ధన్యుడు. అతని కోసం సుజాత అనే దేవకన్య ఓడ ఎక్కి సముద్రాలు దాటి వస్తోంది.

అమెరికాలో 'క్రిస్టియన్ సైన్స్ మానిటర్' అనే దినపత్రిక ఇప్పటికీ న్యూయార్క్ నుంచి కాబోలు వెలువడుతుంది. ఆ పత్రిక క్రిస్టియన్ మతపరమైన భక్తి వైద్యానికి సంబంధించినది. నమ్మితే రోగాలు నయమవుతాయని ఒక ఉద్యమం నడిపారు.

సులేమాన్‌ను సుజాత ప్రేమతో సేవించడం మొదలెట్టింది. అతను అసహ్యంగా, జుగుప్సాకరంగా ఉన్నాడు. శరీరమంతా తుడిచి శుభ్రం చేసింది. మందులు నియతిగా వాడింది. అతను చనిపోవడం మటుకు ఖాయం. ఈ షిప్‌లో కొన్నాళ్ళు మాత్రం బతుకుతాడు అన్నారు.

సుజాత నర్సింగ్ వదిలేస్తే సులేమాన్ బతకడని అంతా అనుకున్నారు. సులేమాన్ తెలివి తెచ్చుకుని తన ప్రాణదాతను, ఆరోగ్య దేవతను తనివితీరా చూసుకుని అభివాదం చేశాడు. సుజాత వారించింది.

సుజాత ఒంటరిగా కూర్చున్నప్పుడు 'ఏల నీ దయ రాదూ' అనే కీర్తన నెమ్మదిగా లోపల్లోపల తన కోసం అన్నట్లు పాడుకుంది. ఓడ డాక్టరు సుజాతను బతిమాలి ఆమె సామాను సులేమాన్ క్యాబిన్‌లోకి తెప్పించేశాడు.

ఒక రాత్రి శక్తినంతా కూడదీసుకుని సులేమాన్ అడిగాడు- 'నువ్వెవరు! ఏమిచ్చి నీ రుణం తీర్చుకునేది?' అని చేతులు పట్టుకుని కన్నీరు కార్చాడు.

'ప్రేమ విశ్వజనీనమైనది. ప్రేమే దైవము. దైవ సహాయం వల్ల మీరు తప్పక బాగుపడగలరు' అంది సుజాత.

'నీకు నేనేమి ఇవ్వగలను? ఏమిచ్చి నీ రుణం తీర్చుకోగలను?' అన్నాడు.

'నాకేమీ ఇవ్వనక్కర్లేదు. నాకేమీ వద్దు' అంది సుజాత.

'ఇప్పుడు నాకు సంతోషంగా ఉంది. ఈ సంతోషంతో నన్ను చచ్చిపోనీ - నేనెలాగా ముసలివాణ్ణి. బతకను ఎంతోకాలం - నేను చనిపోయేదాకా నా దగ్గరే ఉంటానని మాట ఇయ్యి.'

'నేను మిమ్మల్ని విడిచి పెట్టను నర్సుగా - సరేనా?' అని నవ్వింది. సులేమాన్ ఆర్తిగా ప్రాధేయపడ్డాడు. 'అయితే, నువ్వు నన్ను పెళ్ళి చేసుకో - అలా అయితే విడవకుండా నాతోనే ఉంటావని నాకు నమ్మకం కుదురుతుంది. ఈ షిప్‌లో నాకు నీవే దిక్కు!'

'అదేమిటి పెళ్ళా? పెళ్ళెందుకు' అంది సుజాత.

'నేను మురారి అనే డాక్టర్ని కలుసుకోవడానికి లండన్ వెళ్తున్నాను, అతనికి మిసవనున్ని ఉండలు ఇష్టం. అవి కూడా తీసుకెళ్తున్నాను. ఓడ దిగగానే లండన్‌లో మేం పెళ్ళి చేసుకుంటాం.'

'అల్లాగే కానీ, నీ పెళ్ళికి నేను అడ్డు నిలవను. లండన్‌లో ఉన్న నా ఆస్తిపాస్తులన్నీ నీకే చెందుతాయి, చావబోతున్న నన్ను పెళ్ళాడితే' అన్నాడు సులేమాన్.

'మీ ఆస్తిపాస్తులు, మీ ఐశ్వర్యం నాకెందుకు? నా ప్రేమ నాకుండగా నాకేవీ వద్దు.'


'ప్రేమికులు తెలివి తక్కువవాళ్ళు. ఆస్తి, డబ్బు, ఐశ్వర్యం నేను నీకిస్తానంటూంటే వద్దంటావే - నీతో నేను కాపురం చేసి సుఖిస్తానంటం లేదు. నిన్ను పెళ్ళి చేసుకుని తృప్తితో చద్దామని అనుకుంటూ ఉంటే ఆ అవకాశం నాకివ్వవేమిటి?'

'మీకివ్వాలని ఉంటే నాకేదన్నా బహుమతి ఇవ్వండికానీ, మిమ్మల్ని పెళ్ళి చేసుకోవడం దేనికి?'

'నన్ను పెళ్ళాడితే నా ఐశ్వర్యానికంతా వారసురాలవు అవుతావు. నా ప్రాణదాతకి నేనీమాత్రం ఇచ్చుకోలేనా—'

'మీరు ఉండరనుకుని మిమ్మల్ని పెళ్ళాడటం ఎలాగో అమానుషంగా ఉంటుంది. మీ ఆస్తులు నాకెందుకు? లండన్‌లో దిగాక మీరెవ్వరో నేనెవ్వరో? ఎంతోమంది పేషంట్లకు సేవ చేస్తాం. జబ్బుతోనే మనకు సంబంధం. జబ్బు తగ్గాక మీరెవ్వరో, నేనెవ్వరో —'

'నాకు జబ్బు తగ్గేది లేదు. నేను లండన్ దాకా రాను. ఈ బతికి ఉన్న క్షణాలు కాస్సేపు ఆనందంగా గడపనీ - నీకు కానుకగా నా సర్వస్వం దఖలుపరుస్తున్నాను నీ కాళ్ళదగ్గిర. తన్నేయకు నా అర్జీని -'



సుజాత మెత్తబడి ఆలోచించింది. 'సులేమాన్ మంచితనంతో ప్రాథేయపడుతున్నాడు. ఈ షిప్ దిగుతూనే తనొక ఐశ్వర్యవంతురాలైన స్త్రీగా మారిపోతుంది. ఇదంతా విధి మాయ. ఇప్పుడు వద్దంటే మురారీ తనూ లండన్లో సామాన్య జీవితం అతి సామాన్యంగా గడపాలి. ఈ అవకాశాన్ని ఎందుకు వద్దనాలి. ఎలాగూ గుండె జబ్బుతో కాలం చేసే ఒక సులేమాన్‌కు తాత్కాలికంగా భార్యనైతే వచ్చే నష్టమేమిటి?'

'ఈ ప్రపంచం ఒక నాటక రంగం. మనమంతా పాత్రధారులం. మన పోర్షన్ అవగానే మనం తెర మరుక్కి వెళ్ళిపోతాం. ఈ సంగతి చెబితే నవ్వు కుంటాడు మురారి.' గంభీరమైన విషయాన్ని తేలికగా తీసుకున్నాక మనసు దూదిపింజలా మారి గాలిలో ఎగిరింది.

సూయజ్ కెనాల్‌లో గేట్లు తెరవక ఓడ అక్కడ లంగరు వేసింది. తన పరిస్థితి ఏమైనా అటూ ఇటూ అయితే, గుమాస్తా, నౌకర్లు వ్యవహారాలని గోల్ మాల్ చేయడానికి అవకాశం ఇవ్వకుండా - నర్సు సుజాతని పెళ్ళి చేసుకుంటే చక్రం అడ్డువడు తుందని సులేమాన్ ఆలోచిస్తున్నాడు.

సుజాత దైహికమైన సౌందర్యాన్ని సులేమాన్ చూసి తృప్తి పడుతూ, నాలుక చప్పరిస్తూ ఆనందిస్తున్నాడు. శ్రీమంతుడికి భోగాల పట్ల ఉండే లాలన చావలేదు.

సుజాత మాత్రం విశ్వజనీనమైన ప్రేమ భావంతో రోగిలో, రోగి సేవలో పరమాత్మను చూడగలుగుతోంది. సులేమాన్ తెలివిలో ఉన్నప్పుడూ లేనప్పుడూ ఆమె నిష్కామకర్మ చేస్తోంది. శ్రీకృష్ణుడు చూపిన మార్గంలో ఆమె పయనిస్తోంది.

షిప్ డాక్టరుగారిని సుజాత కలుసుకుంది.

'సులేమాన్ ఆరోగ్యం గురించి మీరేమనుకుంటున్నారు డాక్టర్' అంది.

'నాకంటే మీకే ఎక్కువ తెలును. మీ నర్సింగ్ వల్లే అతను జీవించి ఉన్నాడు. అది మానేస్తే అతను హరీ మనడం ఖాయం.'

'అంటే ఆ పాపం నాకు చుట్టుకుంటుందన్నమాట.'

'తన్ని పెళ్ళి చేసుకో మంటున్నాడు నన్ను' అని నవ్వింది.

'నిజం. నువ్వు అతన్ని వదిలి వెళ్ళిపోకుండా దగ్గర ఉంచుకోవాలని సులేమాన్ కోరిక! నీ యౌవనం మీద కన్నేసి కాదు.'

'చనిపోతాడని తెలిసి తన్ని పెళ్ళి చేసుకోవడం కేవలం మానసికమైన తృప్తి కోసమే.'

'ఆ తృప్తి తీరాక అతను నిశ్చింతగా కన్ను మూస్తాడు.'

'మీరెలా చెప్పగలరు ఆ మాట?'

'తను భోగాల్లో పుట్టి పెరిగాడు. శిథిలమై పోయింది' మొత్తం బాడీ. అది ఉందీ అంటే నీ వల్ల. నీ మీద కూడా సులేమాన్ కన్ను ఆనింది. నీ ప్రేమ, నీ మంచితనం అతగాడ్ని అలా ఉంచాయి సుజాతా.'

'ఓ మైగాడ్!' రెండు చేతులూ గుండెల మీద ఆన్చి , మెడ వక్కకు వాలేసింది.

> సులేమాన్ మృత్యుముఖం లోకి వెళ్ళినంతగా బాధ పడుతున్నాడు. ఊపిరి అందడం లేదు.


'మామిడి చెట్టుకు అల్లు కున్నదీ మాధవీలతొకటి. ఏమా రెండిటి ప్రేమ సంపదా ఇంతింతనలేము' అని తనలో పాడుకొంటూ లోపల క్యాబిన్ అంతా తిరిగింది సుజాత.

లండన్‌లో మురారి ఆస్పత్రిలో డ్యూటీలో ఉన్నప్పుడూ లేనప్పుడూ కలలుగంటున్నాడు. వయసులో ఉన్న ఒక యువ డాక్టర్ కళ్ళకు సుజాత యౌవనం, ఆమె అవయవాల పొంకం తలుచుకున్నంత మాత్రంచేత మరులు గొలిపి మత్తెక్కిస్తున్నది. ఆడవాళ్ళ బొమ్మల్ని దిగంబరంగా ఊహించుకుని ఆనందించడం అతనికి రహస్యమైన ఓ అలవాటు. సుజాతా, తనూ ఆస్పత్రిలో కలసిమెలసి పని చేస్తున్నట్లు, ఆమె నవ్వుతున్నట్లు, చిలిపి పనులు చేసి వెక్కిరించి, పరుగెత్తి పారిపోతున్నట్లు తలపోసి తనలో తాను నవ్వుకున్నాడు. యౌవనంలో బాధించే స్త్రీవాంఛ అతని నరాలను మెలిపెడు తున్నది.

సుజాత ఒక మోహినీ స్వరూపమై అతనిని వెన్నంటి తరుముతున్నది.

సులేమాన్‌కి ఓడలో మళ్ళీ జబ్బు తిరగబెట్టింది. సుజాత కన్నులలో వత్తులు వేసుకుని గుళ్ళో దీపంలా కూర్చున్నది. తెలివి వస్తున్నది, పోతున్నది. సుజాత వైపు దీనంగా చూస్తున్నాడు.

ఆహారం వెళ్ళడం లేదు. బార్లీ నీళ్ళు పోస్తున్నారు. మాట పడిపోయిందిలా ఉంది. సుజాత చేతిమీద



తన చేతిని అన్ని గట్టిగా పట్టుకున్నాడు. ముఖమెత్తి ఏదో అడగబోతున్నాడు. ఏమి అడుగుతాడో సుజాతకి తెలును. అక్కడ నుంచి లేచి వెళ్ళి డెక్ మీద నిలబడి సూర్య నమస్కారం చేసింది.

'టు బి ఆర్ నాట్ టు బి' అన్న హేమ్లెట్ పడిన సంశయంలో పడింది. డాక్టర్ క్యాబిన్‌లోకి వెళ్ళి తొంగి చూసింద. డాక్టర్ నవ్వి, 'నీకంత ఆలోచన దేనికి? ముసిలాడు బకెట్ తన్నేస్తాడు. కానీ' అని హెచ్చరించాడు. 'తన వృత్తి లోపమా? తన వయసుదా, యౌవనానిదా తప్పు? తను అందంగా, చలాకీగా ఉండకుండా వికృతంగా, కురూపిలా ఉంటే తన్ను పెళ్ళి చేసుకోమని అడిగేవాడా సులేమాన్!' సుజాత మనసు తేలికపడింది.

షిప్ డాక్టర్, కేప్టెన్, ఇంకా కొంతమంది ప్రయాణికులు, ఒక మత గురువు సమక్షంలో సులేమాన్‌కీ సుజాతకీ పెళ్ళి జరిగింది. టపాకాయలు కాల్చారు.

ప్రయాణికులకి విందు చేశారు. స్వీట్లు పంచి పెట్టారు. పెళ్ళి జరిగినంత సేపూ ఓపికగా కుర్చీలో కూర్చున్నాడు సులేమాన్

అతని కళ్ళలోకి వింత కాంతి వచ్చింది. గట్టిగా సుజాత చేతిని పట్టుకున్నాడు. ఆమె మెడలోకి నెక్లెస్ వచ్చింది. ఒక సిల్కు సంచీలో నోట్లకట్టలు పెట్టి అందిచ్చారు. కొత్త దుస్తులు సరేసరి. అత్తర్లు, సెంట్లు పూసుకున్నారు. అన్ని మతాలవారు సులేమాన్ ఆరోగ్యాన్ని కోరి ప్రార్థనలు చేశారు.

**నువ్వు డబ్బు కోసం ఇదంతా చేశావు. నాకు నీ మీద నమ్మకం లేదు అన్నాడు మురారి.**

ఆ రాత్రి సుజాత నిద్రపోలేదు. ఆమె డ్యూటీ చేసింది. సులేమాన్‌కి చెస్టు కాపడం పెట్టింది. కాళ్ళకు నూనె రాసి, అరికాళ్ళు మర్దనా చేసింది. సులేమాన్ మూలగడం ఆపాడు. అతన్ని ఏదో తెలియని సంతృప్తి ఆవహించింది.

ఈ వివాహానికి భగవంతుని ఆశీర్వచనం ఉందో లేదో తెలియదు.

* * *

అందరూ ఆశించినట్లు సులేమాన్ చావలేదు. సుజాత పాతివ్రత్య మహాత్యం వల్ల సులేమాన్ కోలుకొని బతికి బట్టకట్టాడు. సుజాత గొంతుకలో వచ్చి వెలక్కాయ పడినట్లయింది. యాథాలాపాన చేసుకున్న పెళ్ళి ఉచ్చులు సుజాత కంఠానికి బిగునుకున్నట్లు అయ్యాయి.

కృతజ్ఞతగా సులేమాన్ అన్నాడు గదా - 'సుజాతా, నువ్వు నాకు డైవోర్సు ఇచ్చి వెళ్ళి నీ ప్రియుణ్ణి లండన్‌లో కలునుకో. నీ దారికి నేను అడ్డు రాను. నీకిస్తానన్న డబ్బు నీకు ఎంత కావాలో అంత ఇస్తాను. నేను బతుకుతానన్న ఆశ నాకే లేదు. నీ దయ వల్ల బతికాను. ఓడ లండన్ చేరుకోగానే నీ మార్గం నీది.'

విడాకుల పత్రాలు ఓడలోనే తయారయాయి. సులేమాన్ తలాక్ ఇచ్చాడు సుజాతకి. కానీ, సుజాత అనే కన్నెపిల్ల ఓడ ఎక్కేవేళ ఒకలా ఉండి, ఓడ దిగేసరికి డైవోర్సీ అయింది. అదృష్ట వశాత్తూ విడో కాలేదు. సులేమాన్ ఉదారంగా డబ్బూ బంగారం ఇచ్చి, ఏది కావాలన్నా అడగమన్నాడు. సుజాత సిగ్గుతో ముడుచుకుపోయింది.

మురారి ఓడ రేవుకి వచ్చాడు. సుజాత 'శాకుంతలం'లో 'అనాఘ్రాత పుష్పం'లా లేదు. ఇంగ్లీషు మర్యాదల ప్రకారం ముద్దుపెట్టుకుని కౌగిలించుకున్నాడు. ఆమె వెనకాల సులేమాన్ కూడా దిగి ఆదాబరస్ చెప్పాడు. కాబోయే దంపతులు 'మురారీ, సుజాతా' హొటలుకి వచ్చారు. సుజాతతో బ్యాంక్‌కు వెళ్ళి బంగారం, కొన్ని వేల పౌండ్లు, అందుకు సంబంధించిన డ్రాఫ్టులు, చెక్కులు డిపాజిట్ చేశారు.

మురారి 'ఇంత డబ్బెక్కడిది సుజాతా' అని ఆశ్చర్యపోతూ అడిగాడు. 'బ్రిటన్‌లో నువ్వు శ్రీమంతురాలైన ఆడవాళ్ళలో జమ అవుతావు సుమా' అని అన్నాడు. హొటలుకు వెళ్ళి భోజనాదికాలు పూర్తి చేశాక నిర్లిప్తంగా తనకూ, సులేమాన్‌కు మధ్య జరిగిన కథంతా పూసగుచ్చినట్లు చెప్పింది.

మురారి ముఖకవళికలు మారుతున్నాయి.

'సుజాతా, నా కోసం వస్తూ, ఇక్కడ నేను వేయి కళ్ళతో నీ కోసం నిరీక్షిస్తూంటే నువ్వు దారిలో ఆ ముదివగ్గు సులేమాన్‌ని ఎలా పెళ్ళాడావు? డబ్బు కోసం కాకపోతే — ఛీ! ఛీ! ఎంత పని చేశావు సుజాతా — నో - నో - నో- నేను నిన్ను ఎట్లా పెళ్ళాడేది? ఓ మై గాడ్! నా తల బ్రద్దలై పోతోంది' అని లేచి వెళ్ళిపోయాడు మరో గదిలోకి.

'అయితే, నేనేం పాపం చేశాను? నా వృత్తి ధర్మం ప్రకారం నర్సుగా సేవ చేశాను. అతను పెళ్ళాడమంటే ఎలాగూ పోయేవాడే కదా అని పెళ్ళాడాను. నేనడగకుండా అతను ప్రేమతో ఇచ్చిన డబ్బుతో నీవాదరిస్తావని నీ దగ్గరకు వచ్చాను మురారీ - ఐ లవ్ యూ -' అంది డగ్గుత్తికతో సుజాత.

'నాన్సెన్స్ - నువ్వు డబ్బు కోసం ఇదంతా చేశావు! నేను నిన్ను ఎట్లా పెళ్ళాడను? నాకు నీ మీద నమ్మకం లేదు. సారీ సుజాతా -' అన్నాడు మురారి.

సుజాత నెత్తి మీద పిడుగు పడినట్లయింది.

"మురారి సుజాతను పెళ్ళాడ నిరాకరించాడు."

* * *

చౌదరిగారు ఈ కథంతా శర్మగారికి చెప్పి, 'మీరీ కథ రాయాలి చక్కగా' అన్నారు నవ్వుతూ.

'ఇదేం కథండీ బాబూ - ఇన్నోసెంట్ డామ్‌సెల్ సుజాత జీవితం నాశనమయినట్లేనా?' అని శర్మగారు చౌదరిగారిని ప్రశ్నించారు.

'పోనీ మీరు వారినిద్దరినీ రికన్సైల్ చేయండి— ఆ పాపిష్టి డబ్బును ఏ సంస్థకో డొనేట్ చేసి.'

'సుజాత డబ్బు కోసం కక్కుర్తిపడి సులేమాన్‌ను కట్టుకుందని పావం మురారి విశ్వాసం.'

'మురారికి మీలాంటి పెద్దమనుష్యులు నచ్చచెప్పవచ్చుగదా' అన్నారు జర్నలిస్టు శర్మ.

చౌదరిగారు తల అడ్డంగా ఊయిస్తూ 'ఆ మురారిని నేనేనయ్యా బాబూ' అన్నారు నిర్లిప్తంగా తన లండన్ జీవితాన్ని తలుచుకుంటూ.

'మీరా!..... మరి పావం సుజాత.'

'సుజాత తిరిగి సులేమాన్‌గారి జనానాలోకి వెళ్ళిపోయింది' అన్నారు చౌదరి.

'డామిట్! కథ అడ్డంగా తిరిగింది' అన్నారు శర్మ. ■